క్లుప్తంగా

చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. సీఎం సహాయనిధి ద్వారా చిల్వేర్‌కు చెందిన రూపకు రూ.17వేలు, గోపనికుంట తండాకు చెందిన కిషన్‌నాయక్‌కు చెందిన గేదే విద్యుదాఘాతంతో మృతి చెందడంతో పరిహారం కింద రూ.40వేలు మంజూరయ్యాయి. ఇట్టి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖేడ్‌లో రజక సంఘం భవన నిర్మాణానికి ఐదు గుంటల భూమిని కేటాయించామని తెలిపారు. ఈ సందర్భంగా రజకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రుబీనానజీబ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ విజయ్‌బుజ్జి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, హన్మంత్‌రావుపేట్ సర్పంచ్ దత్తు, నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై సమావేశం

జహీరాబాద్ టౌన్: ఓటరు నమోదు ప్రక్రియపై మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి మెప్మా ఆర్‌పీ, బీఎల్‌ఓలతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా సవరణలకు కూడా అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు శ్రీనివాస్, అనిత పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కుమార్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గుమ్మడిదల గ్రామంలో రూ.20లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేవిధంగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, గ్రామ పంచాయతీ అధికారులు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

'తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే'



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గం సభ్యుడు మాణిక్

నారాయణఖేడ్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటవాసులు కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్ అన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని నారాయణఖేడ్ అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయోద్యమంలో పాల్గొన్న చరిత్ర బీజేపీ, జనసంఘ్, ఆర్‌ఎస్‌ఎస్‌లకు లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దెదింపుదామని పిలుపునిచ్చారు. పార్టీ ఖేడ్ ప్రాంత కమిటీ కార్యదర్శి చిరంజీవి, నాయకులు నర్సింహులు, అరుణ్‌కుమార్, శంకర్, రామన్న పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్ కార్యాలయంలో సఫాయిమిత్ర– సురక్ష శివర్ అంశంపై శుక్రవారం ఆయాశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ సంగారెడ్డి మాట్లాడుతూ 15రోజుల పాటు మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోనం.. వైభోగం



మండల పరిధిలోని కుప్పానగర్ చీలపల్లి గ్రామ శివారులోని మల్లయ్యగిరి ఆశ్రమం ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. సంఘం (కె) గ్రామం నుంచి ఝరాసంగం, చీలపల్లి మీదుగా పీఠాధిపతి బసవలింగ అవధూతగిరి మహారాజ్ పాదయాత్ర పల్లకీసేవ ఊరేగింపు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ఆశ్రమానికి చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

– ఝరాసంగం(జహీరాబాద్)

సమస్యలు పరిష్కరించాలని వినతి

జహీరాబాద్: పట్టణంలోని మాణిక్‌ప్రభు కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే మాణిక్‌రావును శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కాలనీవాసులు కలిసి విన్నవించారు. కాలనీ చివరలో ఉన్న శ్మశానవాటికకు వెళ్లేందుకు రహదారి లేక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు వివరించగా సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీవాసులు శ్రీకాంత్ రెడ్డి, మాధవరెడ్డి, అశోక్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సంగన్న, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గానికి సన్మానం

జహీరాబాద్ మండలంలోని సత్వార్ గ్రామ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే ఎమ్మెల్యే మాణిక్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజు, ప్రభు, నగేష్, చంద్రన్న, యాదయ్య, సంగన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

జహీరాబాద్ టౌన్: మండలంలోని సత్వార్‌కు చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో శుక్రవారం క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆత్మచైర్మన్ పెంటారెడ్డి, పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఝరాసంగం మండలంలోని బోపంపల్లి గ్రామానికి చెందిన గొల్ల తుల్జరాంకు రూ.44 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే మాణిక్‌రావు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విజేందర్‌రెడ్డి, ఎజాజ్‌బాబా పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు



బీఆర్‌ఎస్‌లో చేరిన సత్వార్ గ్రామస్తులతో ఎమ్మెల్యే మాణిక్‌రావు

గొల్ల, కురుమల సంక్షేమానికి కృషి



గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

• ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గొల్ల, కురుమల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో 11మంది లబ్ధిదారులకు మంజూరైన గొర్రెల యూనిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గొర్రెల పంపిణీ పథకం ప్రవేశపెట్టి గొల్ల, కురుమల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. నియోజకవర్గంలో అర్హులైనవారందరికీ గొర్రెలను పంపిణీ చేస్తున్నామని వివరించారు.. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, ఉపసర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ మాధవినరేందర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ..

రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన రుద్రారం గణేష్ గడ్డ సిద్ధిగణపతి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పాండు, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, దశరథరెడ్డి, ఎంపీటీసీ రాజు, మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, ఆలయ ఈవో మోహన్ రెడ్డి, ఆలయ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ..

రాయికోడ్(అందోల్): మండలంలోని ఇటికేపల్లి గ్రామంలో పలువురు లబ్ధిదారులకు ఎంపీపీ మమత, జెడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, ఆత్మ కమిటీ చైర్మన్ విఠల్, కోఆప్షన్ సభ్యుడు అబేద్‌మియా కలిసి గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు కిష్టారెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

• 38 జీపీలకు ప్రత్యేక నిధులు
• సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

హత్నూర (సంగారెడ్డి): బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీపీ నర్సింహులు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కృషితో నర్సాపూర్ నియోజకవర్గంలో 14 చెక్ డ్యామ్‌లను నిర్మించి రైతులకు సాగునీటి సమస్య తీర్చినట్టు తెలిపారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు, మురుగు కాలువలు, రక్షిత మంచినీటి ట్యాంకులు నిర్మించినట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ మెదక్ సభకు వచ్చిన సమయంలో హత్నూర మండలంలోని 38 గ్రామ పంచాయతీలకు ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.15 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్టు గుర్తు చేశారు. ఈ ప్రత్యేక నిధులను అభివృద్ధి పనులకు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌లకు సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ నివేదికను సభ్యులకు వివరించారు. జెడ్పీటీసీ ఆంజనేయులు, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ శారదాదేవి, ఎంపీఈఓ సువర్ణ, పీఎస్ఏ చైర్మన్ దుర్గారెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ

హత్నూర మండలంలోని మంగాపూర్ గ్రామ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

నేడు మంత్రి హరీశ్‌రావు పర్యటన

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శనివారం మంత్రి హరీశ్‌రావు పర్యటించనున్నట్టు జిల్లా శుక్రవారం ఒక ప్రకటనలో అధికారులు తెలిపారు. పటాన్‌చెరు, సంగారెడ్డి, అందోల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు అధికసంఖ్యలో హాజరు కావాలని సూచించారు.

కార్పొరేటర్ పర్యటన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో కార్పొరేటర్ పుష్పనాగేష్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో సీసీ రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, నారాయణ, అప్పల భాస్కర్ పాల్గొన్నారు.

అన్నదానం

న్యాల్‌కల్(జహీరాబాద్): శ్రావణమాసం ముగింపు సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని మిర్జాపూర్(ఎన్), టేకూర్, మల్గి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీల సభ్యులు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పెద్దలు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా శుక్రవారం అంగన్‌వాడీలు పలుచోట్ల భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. సమ్మెకు కార్మిక సంఘాలు, వివిధ పార్టీల నాయకులు మద్దతు ప్రకటించారు.



హత్నూర తహసీల్దార్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



జోగిపేటలో కళ్లకు గంతలు కట్టుకొని..



న్యాల్‌కల్‌లో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు



సదాశివపేటలో ఒంటి కాలుపై నిలబడి నిరసన చేస్తూ..



నారాయణఖేడ్‌లో..

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళి



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సూర్యనారాయణ, తదితరులు

కంది(సంగారెడ్డి): కందిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని ఇంజనీర్స్ డే నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ రిజిస్ట్రార్ డాక్టర్ సూర్యనారాయణ, కళాశాల డీన్ మనోజ్‌కుమార్, ప్రొఫెసర్లు సీమా, ఏఎస్ రావు, కేహెచ్ రావు, డాక్టర్ అరవింద్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి వైద్యనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

ఓడీఎఫ్ సీఎండీ సంజయ్ ద్వివేది



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న సీఎండీ సంజయ్ ద్వివేది

కంది(సంగారెడ్డి): మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని ఓడీఎఫ్(ఏవీఎన్ఎల్)సీఎండీ సంజయ్ ద్వివేది అన్నారు. మండల పరిధిలోని ఎద్దుమైలారం ఆయుధ కర్మాగారంలోని సారత్ స్టేడియంలో శుక్రవారం ఏవీఎన్ఎల్ చైర్మన్ కప్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఓడీఎఫ్ 40 ఏళ్లుగా సాయుధ బలగాలకు అవసరమైన ఆయుధాలను తయారు చేస్తోందన్నారు. ఫ్యాక్టరీ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు అనేక ఆయుధ ట్యాంక్‌లను తయారు చేసిందన్నారు. బీఎంపీతో పాటు సైనికులకు ఉపయోగపడే ఇతర ఆయుధాల తయారీకి ఆర్డర్లు వస్తున్నాయని తెలిపారు. స్పోర్ట్స్ మీట్ ఈ నెల17వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. జబల్‌పూర్, ఆవడి, మెదక్ ఓడీఎఫ్‌ల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో ఓడీఎఫ్ జీఎం హెచ్‌ఆర్ ప్రవీణ్‌కుమార్, సీజీఎం సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

ముగ్గురికి జైలుశిక్ష

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు ఏడుగురికి జరిమానా, ముగ్గురికి జైల్‌శిక్ష విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 10మందిని అదుపులోకి తీసుకొని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా, మరో ముగ్గురికి రెండు రోజుల పాటు జైల్‌శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **నీలం మధుకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని ర్యాలీ**

పటాన్‌చెరు టౌన్: బీఆర్‌ఎస్ సీనియర్ నేత నీలం మధుకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరుతూ చిటుక్‌ల్ ముదిరాజ్ సంఘం నాయకులు శుక్రవారం చిట్కుల్ నుంచి రుద్రారం గణేష్‌గడ్డ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ శ్రీను, నాయకులు సింహాద్రి, నర్సింహులు, వెంకటేశ్, సంజీవ్, శ్రీను, స్వామి, శ్రీను, జంగయ్య, నరేష్, రాము, రాజు, విష్ణు, ప్రశాంత్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ **జాబ్‌మేళాకు విశేష స్పందన**

వట్‌పల్లి(అందోల్): జోగిపేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు అధికసంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన 15 మందికి గుర్తింపు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అడవిరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత, టీఎస్‌కేసీ దేవి, కెరియర్ గైడెన్స్ కోఆర్డినేటర్ అనసూయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

◆ **పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రశాంతమైన వాతావరణంలో పండగలను జరుపుకోవాలని కొల్లూరు ఇన్‌స్పెక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి మండపాలను ఏర్పాటు చేసేవారు తప్పకుండా అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **నియామకం**

పటాన్‌చెరు: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ వైస్‌చైర్మన్‌గా జాయా శ్రీను నియమితులైనట్టు జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ హన్మంత్ యాదగిరి, పటాన్‌చెరు నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా జాయా శ్రీను మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

◆ **కొనసాగుతున్న నిరాహారదీక్ష**

సంగారెడ్డి అర్బన్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ సంగారెడ్డిలోని మహనీయుల విగ్రహాల వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లుపై కేంద్రప్రభుత్వం స్పందించేవరకు దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

సంగారెడ్డి అర్బన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 20లోపు హెచ్ టీ టీ పీ ఎస్://జీటీజీ ఎస్ ఐ టీ ఐ.జీవోవీ.ఐ ఎన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్లికేషన్ ప్రింట్ కాపీతో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఐటీఐలలో ఈ నెల 20 నుంచి 23 వరకు కళాశాలలో హాజరుకావాలన్నారు.

◆ **నేడు ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భావ సభ**

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 16న ధర్మ జాగరణ పార్టీ ఆవిర్భావ సభ నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించే సభకు ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ హాజరుకానున్నట్లు తెలిపారు.

◆ **జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడిగా నక్క నాగరాజుగౌడ్**



సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడిగా నక్క నాగరాజుగౌడ్ రెండోసారి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో హరిత టూరిజం హోటల్లో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం కార్యవర్గ సమావేశంలో పట్టణానికి చెందిన నక్క నాగరాజుగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజుగౌడమాట్లాడుతూ తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మణ్‌గౌడ్‌కు, రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. గౌడ సామాజికవర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ముగిసిన సప్త భజన



ఝరాసంగం(జహీరాబాద్): శ్రావణమాసం పురస్కరించుకొని హనుమాన్ మందిరం ఆలయంలో వారం రోజులుగా నిర్వహించిన సప్త భజన శుక్రవారం భక్తిశ్రద్ధలతో ముగిసింది. మండల పరిధిలోని కక్కర్ వాడ గ్రామంలో ముగింపు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, స్వామివారి పల్లకి సేవ–ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోహన్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.